'చిత్తశుద్ధి'తోనే తెలుగుకు వెలుగు

తెలుగు భాష దుస్థితి గురించి కొత్తగా ఇప్పుడు చెప్పుకోనవసరంలేదు. తెలుగు మాట్లాడేవారు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వున్నా, భారతదేశంలో మాతృభాషగా తెలుగు మాట్లాడేవారి సంఖ్య నాలుగవ స్థానంలో వున్నా, 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని చంకలు గుద్దుకున్నా, తెలుగు భాష పరిస్థితి నానాటికీ 'తీసికట్టు నాగంబొట్లు' అన్న చందంగా మారిపోతోంది. తెలుగు గురించి ఎంత ఆవేదన చెందుతున్నప్పటికీ, దాన్ని మెరుగుపరిచే ప్రయత్నం చేయటంలో మాత్రం మనందరం విఫలం చెందుతున్నాం. ఈ మాత్రమైనా తెలుగు భాష, తెలుగు సంస్కృతి బతికి బట్ట కడుతున్నాయి అంటే కారణం గ్రామీణ మహిళలే, ఇంకా గృహిణులు. విద్యావంతులకంటే ఎక్కువగా చదువులేని వాళ్ళే తెలుగు భాషను కాపాడుతున్నారు, మన సంస్కృతిని నిలబెడుతున్నారు. చదువుకున్నవారు తెలుగు, ఇంగ్లీషు కలిపి మాట్లాడుతున్నారు. కొందరు అచ్చంగా ఆంగ్లమే మాట్లాడుతున్నారు. దీనికి కారణం ఆత్మవంచనే.

ఇప్పుడు మనకు కావాల్సింది తెలుగు భాషను ఎలా కాపాడుకోవాలి, ఎలా అభివృద్ధి చేసుకోవాలి అనే ఆలోచన. గ్రంథాలయాలు, విద్యాలయాలు, సాహిత్య అకాడమి, అధికార భాషా సంఘం... తెలుగు భాషకు మూల స్తంభాలైన ఈ నాలుగూ బలోపేతమైతే తెలుగు భాష వైభవంగా వర్ధిల్లుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా 500 పైగా గ్రంథాలయాలు ఉన్నాయి. దాదాపు ప్రతి మండల కేంద్రంలోనూ ఓ గ్రంథాలయం ఉంది. అయితే, ఇవి అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. భవనాల కొరత, సిబ్బంది కొరత, చాలినంత స్థలం, ఫర్నిచర్ సౌకర్యం లేకపోవడానికి తోడు, కొన్ని చోట్ల విద్యుత్ బిల్లులు కట్టే పరిస్థితి కూడా లేదు. మరో ముఖ్యమైన సమస్య కొత్త గ్రంథాలను కొనుగోలు చేయకపోవటం. ఏళ్ళ తరబడి అవే పాత పుస్తకాలు, విద్యార్థులు, పోటీ పరీక్షార్థులు కూడా కాలం చెల్లిన పుస్తకాలతోనే కుస్తీ పట్టాల్సి వస్తోంది. పుస్తకాల కొనుగోళ్లలో హేతుబద్ధత ఉండదు. స్థానిక సంస్థల నుంచి రావాల్సిన సెస్ ఏయేటికాయేడు బకాయిగా పేరుకుపోతోంది. కొన్ని గ్రంథాలయాల్లో పుస్తకాలు కొంటున్నప్పటికీ అవి పోటీ పరీక్షల పుస్తకాల వరకే పరిమితం అవుతున్నాయి. పాఠకుల సంఖ్యను పెంచటానికి చేపట్టే చర్యలు కుడా కంటి తుడుపుగానే ఉంటున్నాయి. వీటన్నిటికీ మించి గ్రంథాలయ పరిషత్‌కు అధ్యక్షుణ్ణి నియమించటంలేదు. సిబ్బందికి సకాలంలో జీతాలూ అందడం లేదు. వెంటనే గ్రంథాలయాలకు రావాల్సిన సెస్ జమయ్యేట్టు చూడాలి, కొత్త పుస్తకాలను కొనుగోలు చేయాలి. విజ్ఞాన సౌధానికి, భాష అభివృద్ధికి గ్రంథాలయాలే పునాది కనుక గ్రంథాలయాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. అవసరాలకు తగిన సౌకర్యాలు, గ్రంథ సంచయనం కొనుగోలు చేయాలి. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు చదవకుండానే ఉన్నత విద్య వరకూ పూర్తి చేసే అవకాశం వుంది. దీని వల్ల తెలుగు చదవాల్సిన అవసరంగానీ, తెలుసుకోవాల్సిన అవసరంగానీ ఇక్కడ విద్యార్థులకి కలగటం లేదు. ఇప్పుడిప్పుడే తెలుగు ఒక సబ్జెక్టుగా తప్పనిసరి చేసినప్పటికీ ఇంకా ఆ భావన స్థిరపడలేదు. పైగా పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ఖచ్చితంగా ప్రవేశపెట్టాలనే ప్రభుత్వ ఉత్తర్వులు మాత్రం ప్రబలంగా ప్రచారంలోకి వచ్చాయి. ఈ రోజు తెలుగు మీడియంలో చదవాలన్నా తగినన్ని కళాశాలలు లేవు. ముఖ్యంగా సామాజిక శాస్త్రాల్లో చేరే విద్యార్థులు బాగా తగ్గిపోయారు. అందరూ ఇంజనీరింగ్ వైపే పరుగులు. అది ఆంగ్ల మాధ్యమంలోనే వుంటుంది. తెలుగు



> **నవ్యాంధ్రలో ప్రస్తుతం సాహిత్య రంగంలో స్తబ్ధత నెలకొని వుంది. పొరుగు రాష్ట్రంతో పోలిస్తే ఇక్కడ సాహిత్యానుకూల వాతావరణం అంతగా లేదు. నూతన ప్రభుత్వం సాహిత్య అకాడమి కార్యక్రమాలు చురుగ్గా సాగేట్టు చూడాలి. మంచి సాహిత్యం ఉత్తమ సమాజాన్ని తయారు చేస్తుంది. సాహిత్య అకాడమి ద్వారా కొత్త రచయితలకు, కవులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలి. రచనలను ముద్రించుకునేందుకు రచయితలకు ఆర్థిక సహాయం చేయాలి.**

మాధ్యమంలో చదివినందువల్ల ప్రయోజనం ఏమీ వుండదనేది నేటి విద్యార్థుల నిశ్చితాభిప్రాయం. విదేశాల్లో చదువుకోవాలన్నా, పైస్థాయి పోటీ పోటీపరీక్షల్లో నెగ్గాలన్నా ఆంగ్ల మాధ్యమంలోనే చదవాలన్నది నేటి మాట. పిల్లలు చిన్నప్పటినుంచే ఆంగ్లం మాట్లాడాలనే ఉబలాటంతో తల్లిదండ్రులు కూడా ఇంట్లో సైతం ఇంగ్లిషులో మాట్లాడి తెలుగు అనవసరం అనే అభిప్రాయం కలిగిస్తున్నారు. కాన్వెంటుల్లోనూ, కార్పొరేట్ బడుల్లోనూ తగిన అర్హత, అనుభవం లేని ఉపాధ్యాయులను నియమించటం వల్ల విద్యార్థులకి అటు తెలుగు, ఇటు ఆంగ్లం దేనిలోనూ పట్టు లేకుండా రెంటికీ చెడ్డ రేవడి అవుతున్నారు. గతంలో ఎన్టీ రామారావు ప్రభుత్వం అధికారంలోకి రాగానే వివిధ అకాడమీలను రద్దు చేసింది. అందులో సాహిత్య అకాడమీ కూడా వుంది. తిరిగి 2019లో సాహిత్య అకాడమీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం అధ్యక్షుడిని, సభ్యులను నియమించింది. అయితే అది పని ప్రారంభించకుండానే సార్వత్రిక ఎన్నికలు వచ్చి వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయింది. అకాడమి కార్యకలాపాలేమి జరగటంలేదు. నవ్యాంధ్రలో ప్రస్తుతం సాహిత్య రంగంలో స్తబ్ధత నెలకొని వుంది. పొరుగు రాష్ట్రం తెలంగాణతో పోలిస్తే ఇక్కడ సాహిత్యానుకూల వాతావరణం అంతగా లేదు. నూతన ప్రభుత్వం సాహిత్య అకాడమి కార్యక్రమాలు చురుగ్గా సాగేట్టు చూడాలి. మంచి సాహిత్యం ఉత్తమ సమాజాన్ని తయారు చేస్తుంది. సాహిత్య అకాడమి ద్వారా కొత్త రచయితలకు, కవులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేయాలి. రచనలను ముద్రించుకునేందుకు రచయితలకు ఆర్థిక సహాయం చేయాలి. కవులను ప్రోత్సహించేందుకు పురస్కారాలను అందజేయాలి. అవార్డులకు అర్హుల ఎంపిక మొక్కుబడిగా కాకుండా, సిఫార్సులు లేకుండా నిజంగా సాహితీ కృషి చేసే వారిని చేయాలి. 35 సంవత్సరాలు లోపు ఉన్న సాహితీకారులకు యువ పురస్కారం అందజేయాలి. అకాడమి అధ్యక్షులు, సభ్యులుగా సాహిత్యంతో సంబంధం లేని వారిని నియమించకూడదు. అకాడమి క్రియాశీలకంగా ఉండేలా చూడాలి. గ్రంథాలయాల్లో సాహిత్య పత్రికలు లభ్యమయ్యే ఏర్పాట్లు చేయాలి. ఇవన్నీ నిజంగా జరిగిననాడు రాష్ట్రంలో ఉత్తమ సాహిత్య సృష్టి కూడా జరుగుతుంది. 1966 సంవత్సరంలోనే అధికార భాష చట్టం అమల్లోకి వచ్చింది. ఆనాటి నుంచి పలువురు భాషా సంఘం అధ్యక్ష్యులుగా పనిచేశారు. అయితే వారెవరికీ అధికారాలు ఇవ్వలేదు. తెలుగు వాడకపోయినా వారిపైన సంఘం చర్య తీసుకోలేదు. అధ్యక్షుల్లో కొద్ది మంది మాత్రం అధికారాలు లేకపోయినా తెలుగు భాష అమలు కోసం కొంత కృషి చేశారు.

రాష్ట్ర స్థాయిలో అత్యున్నత ప్రభుత్వ కార్యాలయమైన సచివాలయం నుంచి గ్రామ స్థాయిలోని పంచాయతీ కార్యాలయం వరకు పరిపాలనా భాషగా తెలుగును అమలు జరపాలి. అయితే దురదృష్టవశాత్తు ఉన్నతాధికారులు చాలా మందికి తెలుగంటే చిన్నచూపు. ఆంగ్లంపైనే మోజు. జిల్లా కలెక్టర్ స్థాయిలో తెలుగును పాలనా భాషగా అమలు చేయాల్సిందేనని కచ్చితమైన ఆదేశాలు జారీ చేసి, దానికి తాము కట్టుబడి ఉంటే కింది స్థాయి ఉద్యోగులు ఎందుకు పాటించరు?. అమలు చేయాల్సిన కలెక్టర్లు కూడా దీనిపై పెద్దగా శ్రద్ధ పెట్టటంలేదు. ఉద్యోగాల ఎంపికలో తెలుగు మాధ్యమం నుంచి వచ్చినవారు సరిగా ఎంపిక కాకపోవటంతో ఆంగ్ల మాధ్యమం అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. అందువల్ల తెలుగు భాషని తక్కువగా ఉపయోగిస్తున్నారు. గతంలో సర్వీస్ కమీషన్ తెలుగు మాధ్యమంలో చదివిన అభ్యర్థులకు ఐదు శాతం బోనస్ మార్కులు ఇచ్చేది. దీనివల్ల తెలుగు మాధ్యమం పట్ల విద్యార్థులు ఆసక్తి చూపేవారు. అయితే ఆ నిబంధనని ప్రభుత్వం రద్దు చేసింది. కనీసం ఇప్పుడైనా మాధ్యమంలో రాసినవారికి ఐదు శాతం బోనస్ మార్కులు ఇస్తే తెలుగుకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది. గుడ్డిలో మెల్లగా ఇటీవల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 ఉద్యోగాలలో తెలుగు ఒక నిర్బంధ పేపర్‌గా పెట్టి కనీస మార్కులు సంపాదించాలనే నియమం పెట్టింది. దానివల్ల రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతోద్యోగులు తెలుగు తెలిసిన వారు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రజల మాతృభాషలోనే పరిపాలన జరిగితే అభివృద్ధి కూడా వేగంగా జరుగుతుంది.

ఇలా తెలుగు భాషా వైభవ మందిరానికి ఆధారభూతంగా ఉన్న గ్రంథాలయాలు, విద్యాలయాలు, సాహిత్యం, అధికార భాష అన్నీ బాగుపడితే తెలుగు భాష సమున్నత దిశగా పయనించగలదు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పూనుకుంటే, ప్రజలు చిత్తశుద్ధితో కృషి చేస్తే 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్న మన మాతృభాష కీర్తి మరింత ఇనుమడిస్తుంది.

■ **సోమేపల్లి వెంకట సుబ్బయ్య**

అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం